

# లేఖాయణం
## ఉమ యేలూరి



*మనిషి మనసులోని భావాలకి ప్రతి రూపం, మనసులోని మాటలకి మరోరూపం ఉత్తరాలు. కార్డు, కవరు, ఎయిర్ మెయిల్, ఇ-మెయిల్, ఎస్.ఎం.ఎస్..ఎన్ని రూపాలు మార్చుకున్నా మనిషి ఎదురుగా చెప్పలేని భావాలకి అక్షర రూపం కల్పించడం ఒక కళ..! నెలనెలకీ కొన్ని ఉత్తరాల పరంపరని ఈ నెల నుంచీ ఈ శీర్షికలో మీరు చదువుతారు. వ్రాసేది, అందుకునేది ఎవరైనా కావొచ్చు.. అమ్మా, నాన్న, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు, వదినా, మరదలు, బావా, నేస్తం, అనామిక, ప్రేయసి... ఎవరైనా.. ఒక్కో ఉత్తరంలో ఎన్నో భావాలు..కనిపించని కథలు, వినిపించని మౌన రాగాలు..! రచయిత్రి ఉమ గారు, 'భావన' కలం పేరుతో* **http://kristnapaksham.blogspot.com/** *బ్లాగుని కూడా వ్రాస్తున్నారు.*

### స్వేచ్ఛాభిలాషులు

**శేఖరం,**

అలసి ఆగిన పాదం కదలనని మొరాయించే ఈ వయసులో, 'క్షేమమా?' అంటే 'ఇంకా బతికే వున్నావా?' అని అడగటం అని- మొన్న కలిసినప్పుడు మూర్తి అన్నప్పటినుంచి ఎవ్వరిని ఐనా 'క్షేమమా?' అని అడగాలంటే బాధగా ఉందిరా. కాలధర్మాన్ని ఎదిరించాలని కాదు.... ఎదిరించాలని కూడా లేదు. ఈ వైపరీత్యాలను చూడాలని ఎవరికి మాత్రం ఉంటుందిలే. ఎలా నడిపిస్తోంది జీవితం నిన్ను...? పరుగెత్తే జలపాతం దూకి దూకి, పిల్ల కాలువలను మహా వేగంగా తనలో కలుపుకుని, నదిగా మారి తన ప్రశాంత పయనం సాగించి, అనంత సాగర కెరటాల హోరులో దాని వెనక విలీనమయ్యే మౌనముద్రలా మిగిలిపోవటం అనే జీవిత ప్రక్రియలో ఈ ఆఖరి మజిలీలో మౌనమే ఉత్తమమనిపిస్తోంది.

ఇప్పుడే విక్రం టీవీ పెట్టాడు వాడి హోం వర్క్ ఐపోయినట్లుంది... "గుంటూరు జిల్లాలో వానలే పడలేదని, జంతుబలి, ఈశాన్య రాష్ట్రాలలో వానలతో చెరువులుగా మారిన గ్రామాలు, ఇరాక్‌లో 1930ల కార్ షో చూడటానికి పెరుగుతున్న జనాలు, అన్ని దేశాల నుంచి చేరుతున్న ప్రజలు, మోడలింగ్‌లో అవకాశం దొరికిందని ఉవ్విళ్ళూరుతున్న నలుగురు అమ్మాయిలు.. వాళ్ళకు, జుట్టుకు వేసే రంగు గురించి సమాలోచన"..... అన్నిటిని ఏమి పెద్ద తేడా లేకుండా చూస్తున్న మనం.. నవ్వుతుంటే అడుగుతున్నాడు విక్రం 'ఎందుకు తాత నవ్వుతున్నారు?' అని ఏమి చెప్పాలో చప్పున సమాధానం దొరకలేదు కారణం ఏమిటి అంటావు? ... నువ్వే చెప్పాలి అన్నిటిని విశ్లేషిస్తావు కదా... !

ఆగస్ట్‌లోకి వచ్చేము..!!!

అవునురా శేఖరం నాకు అనుమానం వస్తోంది, ప్రతిది ప్రభుత్వం పని అని అనుకుని తప్పేదో ఒప్పేదో వాళ్ళు చెపితేకాని వినం, విన్నా ఆ తప్పును ఒప్పు ముసుగులోకి ఎలా తేవాలా అని ఆలోచించే మేధావి వర్గం. అంతకు మించి, చాలా మటుకు మర్చిపోయిన స్వతంత్రత... బానిసత్వం... ఆశలకు, డబ్బులకు, పదవులకు, పెదవులకు... టీవీ వాళ్ళు, సినిమా వాళ్ళు ఇలా ఎవరో ఒకరు అనునిత్యం మనం ఎలా ఉండాలో, ఎలా తినాలో, ఏది చెయ్యాలో, ఏది గొప్పో, ఏది దిబ్బో నిర్ణయిస్తున్న ఈ కాలంలో మనకు నిజంగా స్వతంత్రం వచ్చింది అంటావా? మన కాలం నాటి స్వాతంత్రత అనే పదానికి మనం అనుకున్న అర్ధం మార్చి రాయాలి అనుకోవాలా అని

అనుమానంగా ఉంది. మనం స్వాతంత్ర్యం గాఢంగా ఆకాంక్షించాము, ఆ భావన మన అణువణువులో జీర్ణించుకుందేమో అనేంతగా నమ్మాము. కాని ఇదేమిటి... ఎవరి నుంచో బానిసత్వం పోయి మనకు మనమే బానిసలం! ఇలా ఉన్నప్పుడే కదా ఆంగ్లేయులు వచ్చి దానిని అవకాశంగా తీసుకున్నారని, అప్పటి రాచరికపు ఫ్యూడలిజపు అవశేషాలను మన తాతలు గుర్తున్నంత వరకు, విన్నంతవరకు మనకు చెప్పారు. మళ్ళీ అదే పునరావృతం అవుతుందా? ఆ దుస్థితి చూడవలసి వస్తుందంటావా మనం? లాఠీ దెబ్బకు కూడా ఇంత వెరవలేదే మనం ఈ ఆలోచనకే భయం వేస్తోంది...

1947 ఆగస్ట్ నెల అంతా పరవళ్ళు తొక్కిన ఉత్సాహం, ఇక రేపో మాపో ఎగురవేయబోయే జాతీయ జెండాలు నేయించుకుని భద్రంగా గుండెలకు హత్తుకున్నప్పటి ఆ నూలు మెత్తదనం... రాబోతున్న కాలమంతా ఇక మనదే, కలిసి వేసేద్దాము ప్రగతి సోపానాలు, ఎక్కడా ఆగనే ఆగదు ఈ విజయపు బావుటా.. అని కళ్ళు తెరుచుకునే కన్న కలలు... కొత్త రాజ్యాంగంలో ఏమేమి ఉండబోతున్నాయి, దాని ఫలితాలేమిటి అని మన నాన్నలు బాబాయిలు రచ్చబండ దగ్గర కూర్చుని చేసిన ఆలోచనలు, మెలి తిప్పిన మీసం చూసి ముసి ముసిగా నవ్వి మూతి తిప్పిన మీ వదిన దరహాస చంద్రికల వెలుతురు.. అన్నీ నాకింకా నిన్నో మొన్నో జరిగినట్లు ఉందిరా శేఖరం... ఇన్ని సవరణల తరువాత కూడా సరి కాని రాజ్యాంగం, సరిచేయలేని మన భవిష్యత్తు మళ్ళీ గాంధీగారు వచ్చి కష్టపడ్డా సరికావేమో...

ఏమంటావు?

ఇంటికి పోస్ట్‌మాన్ రాగానే పైన ఏమి ఉందో కూడా చూడకుండానే ఇంటిల్లిపాది "మీకోసం పోస్ట్" అని గదిలో పెట్టేసి వెళతారు... అంత నమ్మకం ఈ ఇంట్లో నాకోసం తప్ప పోస్ట్‌మాన్ రాడు అని. మొన్న విక్రం స్కూల్ నుంచి ఆ హెడ్ మాష్టారు కూడా నాకు మల్లే పాతకాలం మనిషో ఏమో.. ఈ మెయిలో, ఆ మెయిలో.. ఏదో అది పంపకుండా, ఉత్తరం రాస్తే వీడి చదువు గురించి, పైన "విక్రం తల్లి తండ్రులకు" అని రాసి కూడా ఉంటే నా కొడుకే తీసుకు వచ్చి గదిలో ఇచ్చి వెళ్ళాడు. ఎంత అలసత్వమో చూసావా? ఇదే మూస పోసిన మనస్తత్వం అందరిలోను... నాదికాదు, నాకు లాభం లేదు అనుకుంటే దేనిని పట్టించుకోరు. నిస్వార్ధం అంటే నిలకడగా చూపించే స్వార్ధం అని అర్ధం చెపుతారేమో ముందు ముందు తరాలకు. ప్రతిదానికి పోల్చుకుని బాధపడతావు మార్పు సహజం అని అందరు విసుక్కుంటున్నా ఈ ధోరణి మాత్రం మారటం లేదురా శేఖరం నాకు.

సరే మరి అలుక్కుపోతున్న కంటి చూపుకు ఈ మిల మిల లాడే దీపపు వెలుతురు కూడా సాయం చెయ్యలేకపోతోంది.. నీ జాబు కోసం ఎదురు చూస్తూ..

స్నేహితుడు,

క్రిష్ణయ్య వ్రాలు..

క్రిష్ణయ్యా,

క్షేమమే నేను ఇక్కడ.. నువ్వు క్షేమమని ఆశిస్తున్నా.

నీకు ఇంత వయసు వచ్చినా దూకుడు తగ్గలేదురా.! ఆవేదన, ఆవేశం సమస్యలకు పరిష్కారం కాదు. అంటే అవి లేకుండా ఉండమని కాదు అర్ధం వాటిని తులనాత్మకంగా పరిశీలించి జీవితాలకు సమన్వయ పరచుకోవాలి. మార్పు మానవ సహజం. ఆ మార్పు మంచి వైపు మళ్ళాలని మన జీవితానికి దేవుడు ఉనికిని ఊపిరిని ఇచ్చినంత వరకు ప్రయత్నిస్తూనే ఉండాలి.. ఇంక మారటం మారకపోవటం మన ఇష్టం కాదు... మనమే ఆ మార్పుకు మూల కారణమవుతామా..!? మంచిది..! కాదా..!? కానీ....! మన వెనుక మనవంటి వాళ్ళు ఎందరో పరిశ్రమిస్తూనే ఉంటారు, మంచి కోసం సమానత్వం కోసం మార్పు అనేది తరాల నుంచి యుగాల నుంచి సమాజంలో అనునిత్యం జరుగుతునే ఉంది. ఇంకా జరుగుతూనే ఉంటుంది...

ఈ మార్పు అంతా 'చెడ్డ' అని ఎందుకు అనుకుంటావు క్రిష్ణయ్యా? ఇంత పెద్ద ప్రపంచం చిన్నది ఐంది. జరుగుతున్న పనులు నిమిషాలలో అందరికి తెలుస్తున్నాయి.. ఎక్కడో దక్షణాఫ్రికాలో నెల్సన్ మండేలాను చూస్తే సంతోషం కాగటం లేదా? ఇంకెక్కడో అమెరికాలో ఆడవాళ్ళకు మొన్న మొన్నటిదాకా ఓటు హక్కేలేని దేశంలో... నల్లవాళ్ళను నడివీధులలో లాగి కొట్టిన ... కొడుతూనే ఉన్న దేశంలో... ఒక అమ్మాయి, ఒక నల్ల జాతీయుడు అత్యున్నతమైన ప్రెసిడెంట్ పదవికి పోటీ చేయటం, అందునుంచి ఒక నల్ల జాతీయుడు ఆ పదివిని అధిష్టించటం ప్రపంచానికే గర్వకారణం కాదా? ఆ విజయం మన 1947 నాటి ఒడలు చెమరించిన ఆనందాన్ని తలుపుకు తేలేదు..? అవి అన్నీ ఈ పెరిగిన సాంకేతికత మూలంగానే కదరా మనకు అంత తొందరగా సవిస్తరంగా తెలియటం జరిగింది. మన మట్నూరి క్రిష్ణారావుగారు పత్రికలో విషయ సేకరణ కోసం, దానిని బ్రతికించటం కోసం మనం పడిన ప్రయత్నం అప్పుడే మర్చిపోయావా? అప్పటికి అధి ఆధునికతే కదా...

ఇక వాటిని వక్రీకరించటం దుర్వినియోగపర్చటం ఎక్కువగానే ఉంది కాని, మనం బాధపడి ఏమి ఉపయోగం!? స్పందించగలగాలి... మనకు చేతనయినంత వరకు ప్రజాహితం కాని దేనినైనా బాధ్యతాయుతంగా శాంతియుతంగా మనం ఖండించాలి. అది పౌరుడిగా మన ధర్మం! ఎవరో మర్చి పోతే మనకేమిరా..!? గుర్తు ఉందా? మనం ఖద్దరు నేసి మల్లు గుడ్డలు కట్టి మన నాన్నల వెనుక జైజైలు కొట్టి పరుగులు తీస్తే, మన వీధి చివర మల్లయ్య మామ, అతని కొడుకు ఒక్క రోజన్నా వడ్డీలకు తిప్పటం ఆపలేదు! వాడి ఇనుప పెట్టె పగల కొట్టాలని మనం ఎన్నిసార్లు అనుకోలేదు ఆ చిన్న తనపు ఉషారులో..? వ్యవస్థలో 100 శాతం ఎప్పుడూ మారరు, అది ఎక్కడా ఎప్పుడు జరిగేపని కాదు.

నీకు ఆ వార్తలన్నీ చూసి ఎందుకు నవ్వు వచ్చిందో చెప్పనా? ఆ టీవీలో వార్తలు చదివే అమ్మాయి ఈ వార్తలన్నిటిని ఒకే భావంతో, ఒకే గొంతుతో చదివి ఉండి ఉంటుంది అవునా... భావ వ్యక్తీకరణ కూడా మరి వాళ్ళు నేర్పిన చిలకల్లేనే పలకాలి కదా.. అది ఒక రంగుల పెట్టె, దాని నుంచి మనకు కావలసిన విషయాలు తెలుసుకుంటున్నాము అంతే! ఈ తరంలోను తెలివిగల వాళ్ళు అంతవరకే, అవసరమైనంత వరకే తీసుకుని వదిలేస్తున్నారు. తెలివి తక్కువ వాళ్ళు వాటిని చూసి అనుకరించి లీనమయ్యి జీవితాలను పాడు చేసుకుంటున్నారు..

మనం చూసిన ఆ స్వతంత్రం మళ్ళీ పోగొట్టుకుంటాము అంటావా? ఏమోరా క్రిష్ణ. దీని గురించే నా ఆలోచన ఎటూ తేలటం లేదు...

అసలు ఇంకా స్వతంత్రం ఉందా? ఎప్పుడో మన ఆత్మలు డబ్బు కోసం తాకట్టు పెట్టి, ప్రపంచ నిధి నుంచి అప్పు తెచ్చి మన పసుపు, మన బియ్యం, మన వేపాకును ఇచ్చేసి తెచ్చుకున్న బర్గర్లు పిజ్జాలు... ఊపిరాడని పారిశ్రామీకరణ, వదిలేసిన పల్లెలు, వెగటైన ఆ బతుకులు.! మన కోహినూర్ వజ్రంను, మన వెలకట్టలేని సంపదను ఇచ్చి తెచ్చుకున్న గుమస్తా వ్యవస్థను చూసి సంతోషపడటం లాంటిదేనేమో అనిపిస్తుంది ఒక్కోసారి. మననే కూలీలుగా పెట్టి మననే హీనం చేసి మనకోసం ఇచ్చిన రైల్వే వ్యవస్థ, బ్రిడ్జ్స్ లానే ఈ కొసమెరుపేమో మనకు విసిరేసే ఈ ఐటి ఉద్యోగపు కుక్క బిస్కెట్లు అని.!

మనం చూడకపోయినా మన తరువాతి తరాలు చూస్తాయిగా వీటి ఫలితాలు. మనకు చేతనయినంత వరకు మంచి చేద్దాము, మర్చిపోకు. .. మర్చిపోకు.. "సత్యమేవ జయతే.. చెడు వినకు, చూడకు మాట్లాడకు.... అహింసో పరమో ధర్మహ"... మర్చిపోకు... మనం ఒక గొప్ప నాగరికతకు ఆనవాళ్ళము, ఒక ప్రాచీన వ్యవస్థకు మిగిలిన గురుతులము... తప్పక విజయం సాధిస్తాము మంచిని నిలపెడతాము... వంద మాటలు కంటే ఒకే ఒక్క ఆచరణ గొప్ప... నమ్మకమే మనలను ముందుకు నడిపిస్తుంది...

జైహింద్.

మిత్రుడు **శేఖరం** వ్రాలు. ✡ ✡ ✡